# ఓ యశోదకథ

"'యశోదా! ఎన్నిసార్లిలా దిష్టి తీస్తావు నీ గారాల కూనకి? ఇప్పుడెవరి దిష్టి తగిలిందని. మరీ పిచ్చిదానిలా ఏమిటేది?" భర్త మాటకు యశోద ఉలిక్కిపడింది.

"ఇందాక బాబుని చూడటానికి ఇద్దరు ముగ్గురు వచ్చి వెళ్ళారండి. ఎవరి దిష్టి తగులుతుందో ఏమో! పిల్లాడికి నలత చేస్తుంది.

"ఎందుకు నీకంత అపేక్ష? మరీ గాఢమైన మమతలు ఎందుకు పెంచుకుంటావు? ఏ విషయంలోనైనా అంత ఆరాటం, అపేక్ష తగవు సుమా!"

"బావుందండీ! ఏదో పరాయివాళ్ళని గురించి మాట్లాడినట్లు మాట్లాడతారేం? వీడు....వీడు....నా బిడ్డ—నా కన్నబిడ్డ" ఆ మాటను ఒత్తి పలుకుతూ పసివాడిని గుండెల్లో దాచుకుంది.

ఆ క్షణాన్న ఆనందరావు సంతృప్తిగా నిట్టూర్చాడు. యశోద చేతుల్లో పండంటి పసివాడు ఉండాలని తమ ఇద్దరి కలలు పండగా, అనురాగ దీపంగా ఒక చిన్నారి కావాలన్న ఎన్నేళ్ళ కోరికో ఇప్పుడు తీరింది. మరుక్షణం ఆ ఊహలన్నీ గాలికి చెదిరే మేఘాల్లా చెదిరిపోయాయి. తరు

వాత అతని మనసులో సుడులు తిరిగే ఆలోచనలు సుఖంలో ప్రసన్నతనూ సంతృప్తినీ మాయం చేశాయి.

"చూడు యశోదా! ఎందుకలా బాధపడతావు? నిజానికి నీ అంతటి అదృష్టవంతులు ఎవరు?" ఏవేవో తీయని మాటలతో ఊరడించ ప్రయత్నించేవాడు.

"లేదండీ! నేను పాపాత్మురాలిని. ఏ జన్మలో ఏ పుణ్యం చేసుకున్నా నాకు ఈ తపన ఉండేది కాదు. నేను కాయని చెట్టును, పూయని తీగని."

అలా వాపోయే భార్యను ఎలా ఓదార్చాలో అతనికి తోచేదికాదు, "చూడు యశోదా! నీకు బిడ్డలు లేరని కలవర పడుతున్నావే! తల్లి అలనా, పాలనకు నోచని పసిబిడ్డలుంటారనే ఆలోచన ఎప్పుడైనా నీకు వచ్చిందా?' అనేవాడు. అనడమేకాదు అనాధ బిడ్డల ఆశ్రమాలకు భార్యను తీసుకు వెళ్ళి "వాళ్ళందరకూ నీవు తల్లివైతే ఎలా ఉంటుంది? నీ జీవితం ధన్యమై పోదూ, ఒక్క పరమాత్మునికి తల్లి అయిన ఆ యశోద కన్న పరమాత్మునికి ప్రతిరూపాలైన ఇంతమంది పసివాళ్ళకు తల్లివైన నీ మాతృత్వం అమృతం వలె ఉంటుంది కదూ?" అంటూ ఆమె మనస్సును మళ్ళించడానికి ప్రయత్నించే వాడు.

సఫలీకృతుడు కాగలిగాడు. కొంత కాలానికి యశోదకు ఆ రకమైన జీవితం, ఎంతో తృప్తిని కలిగించింది.

తన భార్యలోని ఈ మార్పుకు ఆనందరావుకు సంతోషంగానే అనిపించినా, తన ఆదాయంలోని సగభాగాన్ని ఇలా ఖర్చు చేస్తున్నందుకు బాధ కలిగేది. అయినా ఆనందరావు ఆమెనేమీ అనలేక పోయాడు. యశోద ఆనందంకన్న తనకు మాత్రం ఏం కావాలి? ఆమె హృదయంలో అలము

కున్న ఆవేదనంతా మాయమై యిప్పుడు యెంతో సంతోషం చోటుచేసు కుంది: అదే తనకు చాలు అనుకున్నాడు.

ఆ దంపతులు యిద్దరూ వూహించని విచిత్రం జరిగింది. కొంత కాలానికి నెల తప్పింది తల్లిదండ్రులు కాబోతున్న సంతోషం యిద్దరి మన స్సులలోనూ నిండినా యశోద ఆనందానికి మాత్రం అవధులు పుట్టబోయే పాపను గురించి యెన్నెన్నో వూహించుకొనేది. మెలకువలో నయినా, నిదురలో నయినా తను కనబోయే బిడ్డను గురించే వూహలూ, కలలు. ఒక్కొక్కప్పుడు ఆమె మానసిక స్థితి ఆనందరావుకు అంతుపట్టేది కాదు, "ఎందుకింత ఆరాటం ఆమెలో! ఇంత మురిసి పోతోంది!" ఎందుకని? ఒక వేళ బిడ్డకు ఏదైనా ప్రమాదం జరిగితే యశోద కూడా దక్కకుండా పోతుందేమో! ఏమో ఏమిటి అలా జరుగుతుందా?" ఈ ఊహ అతని మనస్సును తాకినప్పుడు కంపించిపోయేవాడు.

"భగవంతుడా! అలా ఎన్నటికీ జరగనివ్వకు" అని కనిపించని భగవంతుని ప్రార్థించేవాడు.

యశోద వంటింటి పని ముగించి మంచం మీద పడుకుంది. కళ్ళు మూసుకుంటే ఇదివరకు లాలించి, పెంచిన ఎంతోమంది పసిపాపలు కన్పిస్తు న్నారు. మూగరాగాలతో, బోసి నవ్వులతో "అమ్మా!" అని వాళ్ళంతా పిలుస్తున్నారు. తనెంత మూర్ఖంగా ప్రవర్తిస్తోంది! ఎంత స్వార్థపరురాలు అయిపోతూంది! తనకేనంటూ ఓ నలుసు వుండేసరికి ఆ చిన్నారులందరిని మనస్సులోంచి కూడా దూరం చేసేయాలని ప్రయత్నిస్తోంది. తనిన్నాళ్ళు వాళ్ళపైన చూపిన ప్రేమానురాగాలు స్వచ్ఛమైనవి కావా? కేవలం తన మనశ్శాంతి కోసం వాళ్ళని ఉపయోగించుకుందా? తన మనస్సులో ఇంత సంకుచితత్వం ఎప్పుడు చోటు చేసుకుంది? తనను తాను ప్రశ్నించుకుంది.

ఈ బిడ్డకూడా వాళ్ళందరితో సమానం కాదా?ఒక్కక్షణం ఆమె హృదయం మబ్బులు విడిస నిర్మలాకాశంలా స్వచ్ఛంగా మారిపోయింది. మరుక్షణంలో "నేనూ-నా బిడ్డ" అన్న పాశం వాళ్ళందరిని తన మనస్సులోంచి తొలగ ద్రోసింది. తనిలా ఆలోచించి సందుకే తన బిడ్డకు ఏమౌందో అని బెదిరి పోయింది. మరునాడు మరో రక్షరేఖ తెప్పించి కొడుకు చేతికి కట్టించి.

భార్య ఆపేక్ష చూస్తుంటే ఆనందరావుకి అయోమయంగా ఉంది. గతం అతని మనసులో కదలాడింది. నిజంగా "తను కన్నబిడ్డే!" అని ఎంత ప్రేమ చూపిస్తోంది యశోద. "నిజం తెలిస్తే" గత స్మృతులతో అతని గుండె బరువెక్కిపోయింది. లేడీ డాక్టరు ఇద్దరి దగ్గరకు వచ్చి చెప్పిన మాటలు ప్రతిధ్వనించాయి. "సారీ! ఆనందరావుగారు మీకు మగ బిడ్డ కలిగాడు కాని పుట్టినప్పుడే ప్రాణంలేదు" అంది తనతో ప్రక్కనే నిలుచున్న వసుదేవయ్యను చూస్తూ "చూడు! నీకు బిడ్డ కలిగాడు తల్లీ,బిడ్డా కులాసాగా ఉన్నారు!" డాక్టరు మళ్ళీ లోపలికి వెళ్ళిపోయి తన పనిలో లీనమైపోయింది.

ఆనందరావుకు లోకమంతా శూన్యంగా తోచింది. తనెంత దుర దృష్టవంతుడు? ఎందుకిలా జరిగింది? యశోద బ్రతకగలదా? ఈ బాధ భట్టుకొని మామూలు మనిషి కాగలదా? ఒక్కక్షణం క్రితం తను; వసు దేవయ్యా ఒకే స్థితిలా ఉన్నారు. కాని విధి అతనికి గెలుపిచ్చి తనకు ఓటమి మిగిల్చింది.

అదృష్టం లేనప్పుడు ఎన్ని ఉండి ఏం ప్రయోజనం? టీనీళ్ళు త్రాగి. చుట్టముక్క కాల్చుకోవడానికి తన దగ్గర పైసలు లేవని ఎంతో దైన్యంగా అడుగుతున్నాడు వసుదేవయ్య. "అదెంత పని" అంటూ ఓ రూపాయి అతనికిచ్చాడు. భార్య, బిడ్డల ఆరోగ్యం కోసం తను వెయ్యి రూపాయలు తీసుకొని వచ్చాడు. వసుదేవయ్య అదృష్టదేవతను తీసుకొని వచ్చాడు.

అతను అదృష్టవంతుడు. ఇలా ఆలోచిస్తున్న ఆనందరావుకి మెరుపులాంటి వూహ—అంతే. తన దగ్గరవున్న వెయ్యిరూపాయలు వసుదేవయ్యకు యెర చూపించాడు. ఆతను కాస్సేపు తటపటాయించి చివరకు భార్యను వొప్పించి ఆనందరావుతో చేయి కలిపాడు. ఆనందరావు మనసులో ఆరాటం యెగిరి పోయింది. కన్నతండ్రికాక పోయినా బిడ్డకు కొన్నతండ్రి కాగలిగాడు.

యశోద కన్నతల్లి సన్న భ్రమలోనే వుంది. నిజానికి ఈ జగత్తు అంతా భ్రమతోనే నిండి వుందేమో! ఈ భ్రమ లన్నింటికి అతీతులయిన యతీశ్వరులు యెంత అదృష్టవంతులు. అతని మనస్సులో వింత అనుభూతి అలముకుంది. ఒక్కసారి ఆ క్షణాన బిడ్డతో యశోదను చూడాలనిపించింది. ఆమె పడుకున్న గదిలోకి వెళ్ళాడు. పిల్లాడ్ని గుండెల్లో దాచుకొని ఎవరైనా దోచుకుపోతారన్నట్టు రెండు చేతులతో నిదురలోకూడా అతి గాఢంగా పెనవేసుకుంది. ఎంత మోహం? "తనది" అనేసరికి ఎంత అపేక్ష గలుగుతుంది? అనుకున్నాడు.

అలా ఆలోచిస్తూ నిలబడిపోయిన ఆనందరావు తలుపుతట్టిన శబ్దం విని వెళ్ళి తలుపుతీశాడు. ఎదురుగా వసుదేవయ్య!

"ఎందుకొచ్చావు నువ్వు?" కంపించిపోతూ అడిగాడు.

"బాబయ్యా! మీ కాళ్ళకు మ్రొక్కుతాను" అతని కాళ్ళమీద సాష్టాంగపడ్డాడు.

"బావుందయ్యా! లే! లోపల అమ్మగారు నిదురపోతున్నారు. నెమ్మదిగా మాట్లాడు" వసుదేవయ్య అదేం వినిపించుకోకనే బోరుమంటూ చెప్పడం మొదలు పెట్టాడు. "క్షమించండి నేను చేసిన తెలివి తక్కువ పనికి మా ఆడిది తిట్టి పోస్తున్నది. ఎలాగో పొలం అమ్మివేసి వెయ్యి రూపాయిలు జత పెట్టేసరికి ఇంతకాలం పట్టింది. నా బిడ్డడు నాకు బరువు

కాదు బాబయ్యా. నా యెధవ తెలివి తక్కువ తనానికి నాకే సిగ్గుగా వుంది. నా బిడ్డను నాకు ఇప్పించండి. ఈ నెల రోజులూ మా ఆడది అన్నంకూడా సరిగ్గా తినడంలేదు. బిడ్డను ఎప్పుడు చూస్తానా అని కలవర పడిపోతోంది. పేదోళ్ళమైనా కన్నకడుపు బాబూ. తీపి ఎక్కడికి పోతుంది? ఎప్పుడూ వాడు మా కళ్ళల్లోనే మెదులు తున్నాడు. దయుంచండి బాబూ!" వెయ్యి రూపాయలు టేబిలు పైనుంచి ప్రాధేయపడ్డాడు.

వసుదేవయ్య ధోరణి ఆనందరావుకు భయం కలిగించింది. అతని కెలా అయినా నచ్చచెప్పి యశోదను దక్కించుకోవాలి. "చూడు వసు దేవయ్యా! నువ్వు నుండే బిడ్డ నివ్వకపోతే యశోద ఈపాటికి తేరుకొని ఉండేది. బిడ్డనిచ్చి ఆమెలో లేనిపోని ఆశలను మొలకెత్తించావు. కన్నతల్లి నన్న మమతను పెంచావు. ఇప్పుడు ఒక్కసారి ఈ భయంకర నిజాన్ని ఎలా భరించగలదు? నేను నీకు నమస్కరిస్తాను. ఇంకా నువ్వు ఎంత డబ్బు అడిగినా ఇస్తాను."

"మాకు డబ్బు అక్కరలేదు....బాబయ్యా! మీ బాధలేమీ నాకు తెలియవు. చెప్పకండి. మా కన్నబిడ్డను మాకిప్పించండి"

ఆనందరావుకు పాతాళలోకంలోకి జారిపోతున్నట్లు అనిపించింది. అప్రయత్నంగా వెనక్కు తిరిగాడు.

ఎదురుగా చేతుల్లో పిల్లాడితో యశోద నిలబడి ఉంది. "ఇదుగో! వసుదేవయ్యా! మీ కన్నబిడ్డ. తీసుకుపెళ్ళు తల్లికి ఇయ్యి. నా కళ్ళకి కప్పుకున్న పొరలు విడిపోయాయి. "నేనూ", "నా" అన్న స్వార్థం నా మనస్సు నుంచి పోవడంతో స్వచ్ఛంగా ఉంది.తీసుకుపెళ్ళు" గంభీరంగా అంది.

వసుదేవయ్య మళ్ళీ తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు; "ఎంతపని చేశావు యశోదా?" శక్తినంతా కూడ తీసుకొని అన్నాడు ఆనందరావు.

యశోద కళ్ళల్లో నీళ్ళులేవు. ఆమె చూపుల్లో దైన్యంలేదు.

"ఇప్పుడు నేను పరిపూర్ణంగా మాతృమూర్తిని కాగలిగాను. నిన్న మొన్నటివరకు నా కళ్ళల్లో కదలాడిన దీనమైన పిల్లలు యిప్పుడు మళ్ళీ నన్ను ోటి కంఠాలతో "అమ్మా! అమ్మా!" అని పిలుస్తున్నారు. ఒడిలో వొదిగి పోతామంటున్నారు. రండి మళ్ళీ మనం వాళ్ళందరి కోసం ఆశ్రమానికి వెడదాం రండి" సుఖ దుఃఖాలకు అతీతమయిన మానసిక స్థితిలో వున్న యశోద భర్తకు తనే సర్దిచెప్పింది. "యశోదా!" అన్నాడు అతడు ఆమెను హృదయానికి హత్తుకుంటూ.

* *
*